# బంగారు కణిక

ఉదయం తొమ్మిది గంటలయింది.

పశువులు పాకలు వొదిలేసి గెడ్డవేపు నడుస్తున్నాయ్. గొర్రెలూ, మేకలు దొడ్లు వొదిలేసి, వూరి పొలిమేరల్లో కదులుతున్నాయ్. కూలీలు ఇళ్లు వొదిలేసి గరువులు చేరుకుంటున్నారు.

వీరిబాబు, గరువులో ఎత్తుగా వున్న తాటి చెక్కల బడ్డీమీద కాళ్లు కిందకు చాచుకుని కూర్చున్నాడు. పదెకరాల భూమిలోని వేరుసెనగ పంటను చూస్తూ పరవశించిపోతున్నాడు. కాళ్లు అటూ ఇటూ వూపుతూ, పొంగిపోతున్నాడు. అతడు కూనిరాగం తీస్తూ తల ఆడిస్తూ, కూలీలకోసం ఎదురుచూస్తున్నాడు.

ఆరోజు పంటను బయటకు తీస్తారు. ఆరుగంటలకే పెదపాలేర్లు ఇద్దరూ కూలీలకోసం వూళ్లోకి వెళ్లిపోయారు.

ఆ గరువు వీరిబాబుది కాదు. అలాంటి ఎన్నో విశాలమైన భూములూ, తోటలూ వున్న సూరిబాబుది. ఎన్నో పంటలు పండిస్తున్న సూరిబాబు రాజకీయాల్లో పంట ఎంతో లాభదాయకమని కళ్లతో చూసి తెలుసుకున్నాడు. అలాంటి పంటకోసం విరామంలేకుండా సాగుచేస్తున్నాడు. పనులతో వూపిరి సలపని సూరిబాబు, చినమావేగాకుండా, తన భార్య పినతండ్రయిన వీరిబాబుని పెద్ద దిక్కుగా ఇంటికి తెచ్చుకున్నాడు. వీరిబాబు వయసు అరవై దాటిపోయింది. భార్య నలభైఏళ్లు దాటకుండానే చచ్చిపోయింది. వీరిబాబుకి పిల్లలు లేరు. రెండోపెళ్లి చేసుకోమని ఆత్మీయులు పట్టుపట్టినా వీరిబాబు ఒప్పుకోలేదు.

'జీవితంలో పంట ఎంతో ముఖ్యం. ఆ పంటే జీవితం! అయితే నా భార్యకు కడుపు పండలేదు. అది నా లోపంవల్లే కావొచ్చుకదా! మరో స్త్రీ జీవితం కూడా ఎందుకు పాడుచెయ్యాలి' అని వీరిబాబు నిశ్చయించుకున్నాడు. ఒంటరిగా జీవితం గడుపుతున్నాడు.

కాలప్రవాహంలో పదేళ్లు కొట్టుకుపోయాయ్. ఒంటరి ఒంటరిగా, చీకటి చీకటిగా వీరిబాబు జీవితాన్ని గడుపుతున్నాడు. ఆ పదేళ్లలో అతడు జీవితంలో ఎంతో జీవితాన్ని కోల్పోయాడు. నిరాశా, నిస్పృహలతో కృంగిపోతున్నాడు. జీవితంలో ఉత్సాహం చచ్చిపోతోంది. అంతేగాకుండా, ఎవరికోసం బతకాలి?!

ఎందుకోసం బతకాలి?! అలాంటి ప్రశ్నలు మనసులో మెదులుతున్నాయ్. మానసికంగా కృంగిపోతూ, ఏ పనీ చేయకుండా జీవితం కష్టంగా వృథాగా గడుపుతున్నాడు.

అలాంటి రోజుల్లో ఓరోజున సూరిబాబు, వీరిబాబు దగ్గరకు వచ్చేడు. నమస్కారం చేశాడు.

'చినమావా! నువ్వు నాకు చినమావవే కాదు. పిల్లనిచ్చిన చినమావగారివికూడా! నీ దగ్గర నాకు మేనల్లుడిగా చనువున్నట్లే, అల్లుడిగా అధికారం కూడా వుంది. మాకు పెద్దదిక్కు ఎవ్వరూ లేరు. నువ్వే మాకు పెద్దది క్కు. నీ కూతురూ, నీ కూతురి పిల్లలూ కూడా నువ్వు మాతో ఉండాలని పలవరిస్తున్నారు. రోజు రోజూ చెప్తున్నారు. నేనూ అదే కోరుకుంటున్నాను. నీ పాదాలు పట్టుకుని అడుగుతున్నాను. కాదనకు, మా మాట మన్నించు. నువ్వు మాతో వుంటే మా ఇల్లు ఎంతోనిండుగా ఎంతో ఆనందంగా వుంటుంది" అని సూరిబాబు వినయంగా, ఆప్యాయంగా, గౌరవంగా అడిగేడు.

వీరిబాబు చాలాసేపు ఆలోచించేడు. బతకడానికి ఇబ్బంది లేకుండా ఏదో కొద్దిగా వున్నా ఒంటరితనం జీవితాన్ని తినేస్తోందని అనుకున్నాడు. సరే అని ఒప్పుకున్నాడు.

సూరిబాబు ఇల్లు ఎప్పుడూ పెద్దలతో, పిల్లలతో, కలివిడిగా, సందడిగా వుంటుంది. ఆటపాటలతో ఆనందంగా వుంటుంది. ఒంటరితనం అన్న మాటకు ఆ ఇంట్లో చోటులేదు. ఆ ఇంట్లోకి వచ్చేక వీరిబాబు జీవితంలో కొద్ది నెలల్లోనే పెద్ద మార్పు వచ్చేసింది. పిల్లలతో ఆడుకుంటూ, సరదాగా కాలాన్ని గడుపుతున్నాడు. పొల్లాలో తిరుగుతూ, వ్యవసాయం చూస్తున్నాడు. పాలేర్లతో, కూలీలతో పనులు చేయిస్తూ, కబుర్లు చెబుతూ తీరకలేని మనిషిలా మారిపోయాడు.

పదేళ్ల ఒంటరిజీవితంలో భార్య చావు మర్చిపోలేకపోయాడు. ఇప్పుడు మర్చిపోగలుగుతున్నాడు.

ఎవరికోసం బతకాలి?! ఎందుకోసం బతకాలి? అలాంటి ప్రశ్నలిప్పుడు మనసులో లేవు. అంతేగాకుండా, 'జీవితం ఎంతో విలువైంది. జీవితాన్ని నిరాశా నిస్పృహలతో వ్యర్థం చేసుకోకూడదు. కష్టాలు చిరునవ్వులతో ఎదుర్కోవాలి. జీవన చైతన్యం మనసుని ఉత్తేజపరుస్తూ ఉండాలి.' అని ఇప్పుడు అందరికీ చెబుతున్నాడు.

'పని డబ్బు కోసమే కాదు. పని జీవితం! పని జీవన చైతన్యం! పని సంస్కృతి! పని జీవితానికి అర్థం!' అని పదిమందితో అంటున్నాడు.

వీరిబాబు చిన్నప్పుడు సినిమా పాటలు పాడేవాడు. అయితే ఇప్పుడు ఆ పాటలు పాడుకోవడం సిగ్గుగా వుంది. అయితే ఎప్పుడేనా ఆ పాటలు పాడితే, పిల్లలు నవ్వుతూ, గోలచేస్తూ ఆటపట్టిస్తున్నారు. అంచేత సంగీతం మాస్టరుతో పరిచయం ఏర్పర్చుకుని కొన్ని రాగాలూ, కొన్ని కీర్తనలూ నేర్చుకున్నాడు. ఏదో రాగం తీస్తూ ఏదో ఒక పాట పాడుతూ జీవితాన్ని ఆనందంగా గడుపుతున్నాడు.

★ ★ ★

అలాంటి వీరిబాబు, బడ్డీమీద కూర్చుని వూరివేపు కూలీలకోసం ఎదురుచూస్తున్నాడు. కూలీలు వచ్చేశారు. ఇరవైమంది ఆడకూలీలు, ఇద్దరు మగకూలీలు, ముగ్గురు చిన్నకూలీలూ వచ్చేరు. ఆడకూలీలు గంజితప్పేలాలు, తట్టలు మోయడానికి నెత్తిమీద పెట్టుకునే చుట్టుగుడ్డలూ, సగం కాల్చిన చుట్టముక్కలూ చెట్టు కింద పెట్టుకున్నారు.

చిట్టెమ్మ ఏడాది చంటిపిల్లను తీసుకొచ్చింది. లోతుగా, వెడల్పుగా వున్న బుట్టలో గుడ్డలు వేసి, ఇటూ అటూ పోకుండా కూర్చోబెట్టింది. ఆ బుట్ట చెట్టునీడ కింద వుంచింది. బుట్ట పడిపోకుండా రాళ్లు దాపుగా పెట్టింది. పని మొదలెట్టారు.

మొగకూలీలు మొక్కలు పీకి, ఒకచోట పడేస్తున్నారు. కుర్రకూలీలు కాయలు ఏరి, మొక్కల్ని దూరంగా ఒకచోట వేస్తున్నారు.

ఆడకూలీలు చీరలు వెనక్కి మడిచి, గోచీ కట్టుకున్నారు. కొప్పులోని బంతిపువ్వులు పడిపోకుండా, నొక్కి జత్తులోకి దూర్చేరు. బొరగెలు చేత్తో పట్టుకున్నారు. తట్టలు ముందు వేపు పెట్టుకున్నారు. కాయలు తవ్వుతూ బుట్టలో వేస్తున్నారు.

వీరిబాబు రాగం ఆపేశాడు. బడ్డీ దిగి పని దగ్గరకి వెళ్లేడు. పంట ఎలా పండిందో, పని చురుగ్గా చేస్తున్నారో, లేదో చూస్తున్నాడు.

"గురువులూ! మీదమీదటే తవ్వుకుని ఎల్లిపోతన్నారు. భూమిలో కాయలు భూమిలోనే వుండిపోతన్నయ్! లోతుగా తవ్వమన్నా!" అని వీరిబాబు పెద్దపాలేరుని కేకవేశాడు.

గురువులు ఆ మాటలు కూలీలకు చెప్పాడు. అంతేకాకుండా ఒక్కకాయ భూమిలో వుండిపోయిన కూలీ ఇవ్వనని కూడా ఖచ్చితంగా చెప్పేశాడు.

మూడు కళ్లకాయలే గాకుండా నాలుగు కళ్లకాయలూ, ఐదుకళ్లకాయలూ, దొరుకుతూ వుంటే కూలీలందరూ ముచ్చటగా చెప్పుకుంటున్నారు. అయిదు కళ్లకాయలు కనిపించినప్పుడల్లా వీరిబాబు రాగం అందుకుంటున్నాడు.

తట్టలు నిండిపోగానే కుర్రకూలీలు పట్టుకెళ్లి కాయలు కళ్లంలో పోస్తున్నారు. ఖాళీ తట్టలు ఆడకూలీలకు అందిస్తున్నారు. వీరిబాబు మడిచుట్టూ తిరుగుతున్నాడు. ఆడకూలీల ముందు నిలబడ్డాడు.

'ఏరా గురువులూ! మొగోడు ఆడదాన్ని ఒగ్గేసేడనుకో. మరో గుంటను ఎగేసుకుపోయాడనుకో! ఆడది ఒల్లకుంటాది!'

"నిజమే బాబూ!"

"ఆడది మొగోణ్ణి ఒగ్గేసిందనుకో. మరోడితో లెగిసిపోయిందనుకో! మొగోడు ఒల్లకుంటాడా?"

"ఒల్లకోడు బాబూ ఒల్లకోడు. ఆడదాన్ని నరికేస్తాడు. నేదా ఆ మొగోడి పీక కోసేస్తాడు. కాదనుకుంటే. ఇద్దర్నీ కలిపి సంపేస్తాడు. అలా కాదనకుంటే తన పీక కోసేసుకుని సచ్చిపోతాడు"

"ఏటి సేతును బాబూ, ఒల్లకోక" చిట్టెమ్మ వీరిబాబు మొహంలోకి చూస్తూ చెప్పేసింది.

"బాబు బాగా సెప్పినాడు" ఆడకూలీలందరూ తలపైకెత్తి వీరిబాబు మొహంలోకి చూస్తూ చిరునవ్వుల్తో సంతోషాన్ని తెలియజేశారు.

"ఏరా గురువులూ ఎంచేతరా?"

"నాకు తెల్దండి"

అందరూ కూడా తెలీదన్నట్లు నిండుసున్నాలా మొహాలు పెట్టేరు. కూనిరాగం తీస్తూ వీరిబాబు బడ్డీ దగ్గరకు వెళ్ళిపోయాడు. బడ్డీ మీద కూర్చున్నాడు. లోలోపల

పాడుకుంటూ తల ఆడిస్తూ, కాళ్లు అటూ ఇటూ కదుపుతూ పనివేపు నిదానంగా చూస్తున్నాడు.

★ ★ ★

సూర్యుడు నడినెత్తి దాటిపోయాడు. పడమటివేపు కొద్దిగా జరుగుతున్నాడు.

కూలీలు అంబలి తాగడానికి లేచిపోయారు. అంబలి తాగుతూ వీరిబాబు మాటలే గాకుండా గురువులు మాటలు కూడా కబుర్లుగా చెప్పుకుంటూ నవ్వుకుంటూ కూర్చున్నారు.

చిట్టెమ్మ చంటిపిల్లను తీసుకుని చెట్టుచాటుకి వెళ్లింది. పాలిస్తోంది. పిల్ల పాలు తాగుతూ, చిరునవ్వులు నవ్వుతోంది. పాలిచ్చి పిల్లను మళ్లీ బుట్టలో కూర్చోబెట్టింది. బుట్ట పడిపోకుండా, రాళ్లు దాపుగా పెట్టింది. అంబలి తాగుతూ పిల్లను పలకరిస్తోంది. పిల్ల ఉత్సాహంగా చిరునవ్వులు చిందిస్తోంది. చిట్టెమ్మ చల్లగా నవ్వుతోంది. అంబలి తాగింది. పిల్లను ముద్దాడింది. పనిలోకి వచ్చేసింది. వీరిబాబు అడిగిన ప్రశ్నలూ, గురువులు చెప్పిన జవాబులూ, తోటి కూలీలు అంబలి తాగుతూ చెప్పుకున్న మాటలూ ఆమె మనసులో కదుల్తుండగా, ఆమె వడివడిగా, పరధ్యానంగా పనిచేస్తోంది.

★ ★ ★

సాయంకాలం ఆరయిపోయింది. ఎర్రటి సూర్యుడు, ఎర్రటి కిరణాలు కాకుండా, పసుపు రంగు కిరణాలు చల్లుతున్నాడు. పడమటి దిక్కు ప్రపంచాన్ని వశం చేసేసుకున్నట్లు, సూర్యుడు కొండదిగి తొందరగా పడమటివేపు వెళ్లిపోతున్నాడు. మళ్లీ తూర్పున ఉదయించాలని మర్చిపోయినట్లు వడివడిగా వెళ్లిపోతున్నాడు.

"ఏరా గురువులూ! ఇల్రారా!"

"సెప్పండి బాబూ!"

"నేనో మాట ఇన్నాను! నీ సెవినేస్తాను!"

"సెప్పండి బాబూ!"

"ఈమద్దిన ఓ పెద్దింటి బొట్టె ఏం చేసిందో తెల్సా!"

"సెప్పండి, సెప్పండి"

"కొంగుసాటున సుద్దముక్కలాంటి బంగారు కణిక ఎట్టేసుకుని ఇమానంలో ఎగురుకుంటూ ఒచ్చేసిందంట!"

"ఏటి బాబూ! ఏటీ సెద్ద!"

"ఆ మాట ఇన్నాను! అప్పిటికాణ్నుంచీ నాకు ఇసారంగా వుంది! బయ్యింగుంది!"

"కోకలసాటున ఏరుసెనక్కాయలు ఇళ్లకెల్లిపోతాయని బయ్యంగుందా బాబూ?! ఆ ఇద్దె ఈళ్లకి తెల్దు! కాదూ బోదూ అంటే గంపలూ, నెత్తి చుట్టు గుడ్డలూ తనిఖీ చేస్తాను! బాబూ. ఈళ్లే అలగ సేత్తే ఈ బూపెపంచికం విలగుంటదేటి!"

"అది కాదురా!"

"మరేటి బాబూ!"

"నీరు ఎత్తునుంచి పల్లానికి పారుతుంది!"

"నిజమే బాబూ! అందుకే పెద్దోరు ఎత్తుగా కూకుంటారు! కొట్టుకుపోతే, కిందోడే కొట్టుకు పోతాడు!"

ఆ మాటలు విని వీరిబాబు బడ్డీనుండి కిందికి గెంతేశాడు. ఒక్కక్షణం గురువులు మొహంలోకి చూశాడు.

"చెడు నీరులాంటిదట! ఎత్తునుంచి చెడు కొట్టుకొచ్చేసి మన వూళ్లని ముంచేస్తుందేమో అని ఇసారంగా వుంది! బయ్యంగుంది!"

వీరిబాబు ఆందోళనవ్యక్తంచేస్తూ, ఆవేశంగా చెప్పాడు. గురువులు ఆశ్చర్యపోయాడు. నమ్మలేకపోతున్నాడు. వీరిబాబు చెప్పేడుగాబట్టి నమ్మకుండా వుండలేకపోతున్నాడు.

★ ★ ★

కూలీలు పనికట్టేశారు. తట్టల్లో కాయలు కళ్లంలో పోసేశారు. తట్టలు

దులిపేశారు. మడతపెట్టి, వెనక్కి కట్టిన కోకలు కిందకు దించేరు. కోకలు, నెత్తిచుట్టు గుడ్డలు దులిపారు. కూలికోసం నిలబడ్డారు.

గురువులు కూలిడబ్బులు లెక్కపెట్టి ఇస్తున్నాడు. చంటిపిల్ల తల్లిగాబట్టి చిట్టెమ్మకు ముందు ఇచ్చేశాడు.

చిట్టెమ్మ పిల్లవైపు నడిచింది.

పిల్ల బుట్ట అంచులు పట్టుకుని నిలబడింది. చిరునవ్వు నవ్వుతోంది. బుట్టకి దగ్గరగా గజందూరంలో పెద్ద పామొకటి పడగవిప్పి నిలబడింది. పాముని చూస్తూ చేతులు సాచి సంతోషంతో చేతులు కదుపుతూ, చిరునవ్వులు నవ్వేస్తోంది. పిల్లవైపుచూస్తూ నాగస్వరం వింటున్నట్లు ఆనందంగా తల ఆడిస్తోంది పాము.

అలా ఎంతసేపట్నుంచి జరుగుతుందో చిట్టెమ్మ చూడలేదు. ఎవళ్లూ చూడలేదు.

పాముని చూసి బెంబేలు పడుతూ, గుండెలు బాదుకుంటూ, ముందుకు దూకుతూ వెళుతోంది చిట్టెమ్మ. అందరూ పాముని చూసి గుండెలు బాదుకుంటూ ముందుకి వెళుతున్నారు.

“ఒల్లగొండి! గోలసేస్తే పిల్లను పొడిచేద్ది పాము! ఒవుళ్లూ కదలొద్దు. ఒల్లకుండండి!” అని చెప్పి గురువులు ముక్కోణంగా వున్న రాయి తీసుకుని నెమ్మదిగా వెళ్లి ఈతపొద పక్కన నక్కేడు. పిల్ల నవ్వేస్తోంది. పాము పడగ విప్పి ఆడేస్తోంది. అదును చూసి గురువులు రాయిని పాము బుర్రకు సూటిగా, బలంగా విసిరికొట్టేడు. పాము వెనక్కి పడిపోయింది. విలవిల కొట్టుకుంటోంది.

పిల్ల చిరునవ్వులు నవ్వేస్తోంది. గెంతులు వేస్తూ వెళ్లి పిల్లను అందుకున్నాడు. కర్రతో పాముని పొడిచి పూర్తిగా చంపేశాడు.

ఏడుస్తూ, గుండెలు బాదుకుంటూ వెళ్లి చిట్టెమ్మ పిల్లను అందుకుంది. గుండెలకు దగ్గరగా అదిమి పట్టుకుంది.

‘ఇయ్యాల పిల్లకి గండం తప్పింది!’ అని అందరూ దుఃఖాన్నే గాకుండా, సంతోషాన్ని కూడా తెలియజేస్తూ చిట్టెమ్మను ఓదారుస్తున్నారు. పిల్ల బుగ్గలు సున్నితంగా నొక్కుతూ, “గండం తప్పింది! నీకింక సావుండదు!” అని పిల్లను పలకరిస్తూ అందరూ సంతోషంగా నవ్వుతున్నారు.

పిల్ల కేరింతలు కొడుతూ, చిరునవ్వులు చిందిస్తోంది.

చిట్టెమ్మ గురువులుకి దండం పెట్టింది. పిల్ల రెండు చేతులూ జోడించి, పిల్లచేత కూడా దండం పెట్టించింది.

"చిట్టెమ్మా! నీ పిల్ల చిరునవ్వు పాముకి సంగీతం వినిపించేసింది. పాముకి నాగస్వరం వినిపించింది! పాముచేత పడగ విప్పించి, ఆడించేసింది. నీ పిల్లకింక సావునేదు! ఇసారాన్ని కాలికిందేసి, నల్లిని నలిపేసినట్లు నలిపేస్తూ, నీ పిల్లలా నవ్వుకుంటూ, ఇంటికెల్లిపో!" అని వీరిబాబు పిల్లను చేతుల్లోకి తీసుకుని, గుండెలకు అదిమిపట్టుకుని లాలిస్తూ, దీవించి, చిట్టెమ్మకి అదించేడు.

చీకటి అలుముకుంటోంది. కూలిజనం కదిలారు. చీకటిని చీల్చుకుంటూ, వూరివైపు నడుస్తున్నారు.

వీరిబాబు వాళ్లవైపు విషాదంగా చూస్తున్నాడు.

'ఏ వేదాలు పుట్టినా, ఏ వాదాలు పుట్టినా ఆళ్ల బతుకులు కునుకు బతుకుల్లా కునుకుతూనే వున్నాయి గానీ, తలపైకెత్తి నెగనేదు!' అని విచారిస్తున్నాడు.

'చిట్టెమ్మ ఒంటరిగా ఎందుకు బతకాలి! వయసులో వున్న పిల్లేకదా! ఒంటరితనం ఎవరికైనా కఠినమైన శిక్షే కదా!' అని వీరిబాబు అనుకుంటూ చింతిస్తున్నాడు.

చిట్టెమ్మ అందరితోనూ కలిసి నడుస్తోంది. పిల్లను గుండెలకు అదిమిపట్టుకుంది. పిల్ల తలను ఎడంభుజంమీద ఆన్చి, లాలిస్తూ నడుస్తోంది. చేతి గాజుల చప్పుడు గుండెలకు వినిపిస్తోంది. పాదాలమీది పట్టీల చప్పుడు భూమికి వినిపిస్తోంది. చీకటిని చీల్చుకుంటూ గురువులుకి దండపెడుతూ నడుస్తోంది.

'ఓ తల్లీ! ఓ నా కన్నతల్లీ! నీకు పాలు కావాలి. నీకు పాలు కావాలంటే, నాకు బువ్వ కావాలి, నాకు బువ్వ కావాలంటే, నేను పనిచెయ్యాలి. నేను పని చెయ్యాలంటే నిన్ను గాలిలో, ఎండలో, తుప్పల్లో, మొక్కల్లో, చెట్టుల్లో, పక్షుల్లో, పుట్టల్లో, పాముల్లో విడిచిపెట్టాలి. ఇంటిలో వియ్యాల్లో నిన్ను పడుకోబెట్టి, పాలిస్తూ, లాలిస్తూ, బొమ్మలు చూపిస్తూ, జోలపాటలు పాడుతూ, లాలిపాటలు పాడుతూ నిన్ను పెంచలేము కదా నా తల్లీ!' అని చిట్టెమ్మ అనుకోలేదు గానీ, ఆ నిజం ఆమె

మనసులో కదుల్తుండగా వీరిబాబు, గురువులు, తోటి కూలీలూ చెప్పిన మాటలు మనసులో నెమరువేసుకుంటూ వేగంగా నడుస్తోంది.

'మీ అయ్యని పిలకట్టుకు జాడించి, జుత్తట్టుకుని గుంజిగుంజి నాక్కొత్తాను. సూసుకో! ఆడు రానంటే నీకు మరో అయ్యను తెత్తాను. సూసుకో!' అని పిల్ల బుగ్గలు నొక్కుతూ, పిల్లతో చెబుతూ, మనసులో పదేపదే అనుకుంటూ, చీకటిని మట్టేస్తూ, మనసులోని చీకటిని చీల్చేస్తూ అడుగులు వేగంగా వేస్తోంది.

★ ★ ★

(విపుల - మాసపత్రిక - జూన్ 1995)

-----